క్లుప్తంగా

పెద్దదిమిలి హైస్కూల్ సందర్శన



విద్యార్థుల యోగాసనాలు పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాస్

భామిని: మండలంలోని పెద్దదిమిలి జెడ్పీ హైస్కూల్‌ను ఎంఈవో ఎ.శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. విద్యార్థుల ప్రార్థన, ప్రారంభ కార్యక్రమాలను పరిశీలించారు. పక్కనే గల ఎంపీపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజన తయారీ, మెనూ పరిశీలించారు. విద్యార్థుల ప్రమాణాలను తెలుసుకున్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

డంపింగ్ యార్డ్ కోసం స్థల పరిశీలన



నగర పంచాయతీ కార్యాలయం వద్ద అధికారులతో చర్చిస్తున్న సబ్ కలెక్టర్

పాలకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలో శాశ్వత డంపింగ్ యార్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టేందుకు విజయరాంపురం వద్ద స్థల పరిశీలనకు స్థానిక సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ మంగళవారం వెళ్లారు. ఈ ప్రాంతంలో చెరువులు ఉండటంతో వాటికి ముప్పు ఏర్పడుతుందని భావించారు. అనంతరం నగర పంచాయతీ కార్యాలయానికి చేరుకున్న ఆయన స్థానికంగా పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వార్డుల సంఖ్య, ఉన్న పారిశుధ్య కార్మికుల సంఖ్య, శానిటేషన్ ప్రణాళికపై కమిషనర్ రత్నరాజును వాకాబు చేశారు. నూతనంగా ఎంత మంది శానటేషన్ కార్మికులు అవసరమని అడిగి తెలుసుకున్నారు. నగర కార్యాలయం ఎదుట ఉన్న ఖాళీ ప్రాంగణంలో అక్కడ రీసైక్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమీపంలో రక్షిత నీటి పథకం ఉన్నందున తదుపరి చర్యలపై దృష్టి పెట్టాలని సబ్ కలెక్టర్ సిబ్బందికి ఆదేశించారు. డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలన్నారు.

జెడ్పీహెచ్ స్కూల్‌ను సందర్శించిన ఎంపీపీ

పాచిపెంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీపీ బి.ప్రమీల మంగళవారం సందర్శించారు, పాఠశాలలో కల్పిస్తున్న వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నిరుపయోగంగా ఉన్న ఆర్‌ఓ ప్లాంట్‌ను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ..గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ఆర్వో ప్లాంట్ మరమ్మతుల బారిన పడితే కనీసం దాన్ని పట్టించుకున్న పరిస్థితులు లేవన్నారు. కలుషిత నీరు కారణంగా ఇటీవల కురుపాంలో గిరిజన విద్యార్థులు మృతి చెందిన సంఘటనను గుర్తు చేశారు. అలాంటి పరిస్థితులు రాకముందే మంత్రి గుమ్మడి సంధ్యారాణి, కలెక్టర్ స్పందించి పాచిపెంట మండలంలో ఎక్కడెక్కడ ఆర్వో ప్లాంట్ లు నిరుపయోగంగా ఉన్నాయో వాటికి తక్షణమే మరమ్మతులు చేయించి సురక్షిత తాగునీరు విద్యార్థులకు అందజేయాలని సూచించారు. ఎంపీపీ వెంట వైస్ ఎంపీపీ మీసాల నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

స్మార్ట్ కార్డుల పంపిణీ

సీతానగరం: మండలంలో ఇదివరలో పంపిణీ చేసిన రైస్ కార్డుల స్థానంలో కొత్త రేషన్‌స్మార్ట్ కార్డులను వినియోగదారులు అందిపుచ్చుకోవాలని వైస్‌ఎంపీపీ టి.సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు నిడగల్లులో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో కొత్త రేషన్ కార్డులను వైస్‌ఎంపీపీ టి.సూర్యనారాయణ. గాజాపు శ్రీనివాసరావు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రేషన్ వినియోగదారులకు పంపిణీ చేసిన రైస్‌కార్డుల స్థానంలో కొత్త రేషన్ (స్మార్ట్ రేషన్)కార్డులు వినియోగదారులకు రేషన్ డిపోల వారీగా ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇళ్ల వద్దకు రేషన్ కార్డులతో వస్తున్న వారికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

సామాజిక సేవా కార్యకర్తకు సన్మానం

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో పలు సేవాకార్య క్రమాలతో పాటు నేతాజీ గ్రంథాలయాన్ని నిర్వహిస్తూ అందరికీ పరోపకారిగా ఉంటున్న సామాజిక సేవా కార్యకర్త సంజీవినాయుడిని యువత మంగళవారం ఘనంగా సన్మానించారు. గడిచిన 30సంవత్సరాలుగా గ్రామంలో ఉచిత నేత్ర వైద్యశిబిరాలు నిర్వహించడం, వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు, నిరుపేదలకు అండగా ఉంటూ గ్రామంలో చందాలు సేకరించి వారికి అందించడం ఇటువంటి పలు సేవా కార్య క్రమాలు నిర్వహిస్తున్నందుకు యాతవీధి పెద్దలు, యువత, తెలగవీధి యవత సంజీవినాయుడిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ యువత, పెద్దలు సహకరించనిదే ఎవరూ ఎటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహించలేరని తెలిపారు.

ఉద్యమంలా

కోటి సంతకాల సేకరణ సాగాలి

- పేద విద్యార్థులపై కూటమి కన్నెర్ర
- పాలకొండ మాజీ ఎమ్మెల్యే కళావతి



సీతంపేట: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినదిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, నాయకులు

సీతంపేట: కోటి సంతకాల సేకరణ ఉద్యమంలా సాగాలని, కూటమి ప్రజా వ్యతిరేక పాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లి చైతన్యవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. రాష్ట్రంలో పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని, ఇందులో భాగంగానే మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు ధారాదత్తం చేయాలన్న నిర్ణయం తీసుకుందని ధ్వజమెత్తారు. స్థానిక ఎంపీపీ కార్యాలయం వద్ద కోటి సంతకాల సేకరణకు సంబంధించిన సామగ్రిని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాలు సేకరించి గవర్నర్‌కు సమర్పించాలన్న పార్టీ నిర్ణయం మేరకు ప్రతీ కార్యకర్త క్షేత్ర స్థాయిలో ఉద్యమంగా పని చేయాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరితో సంతకాలు సేకరించే పని వేగవంతం చేయాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో కష్టపడి పేద విద్యార్థుల కోసం చరిత్రలో నిలిచేలా ఒకేసారి 17 మెడికల్ కళాశాలల మంజూరు చేసి కొన్ని నిర్మించి తరగతులు ప్రారంభించగా, కొన్ని నిర్మాణ దశలో ఉండగా కేవలం వైఎస్ జగన్‌కు మంచి పేరు వస్తుందనే దుర్బుద్ధితోనే ఈ కళాశాలలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో చంద్రబాబు పెడుతున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్య, వైద్యం రెండు కళ్లుగా ఉండేవన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, సర్పంచ్‌లు హెచ్.ఆదిలక్ష్మి, ఎస్.సుశీల, ఎన్.తిరుపతిరావు, ప్రధాని, బి.తిరుపతిరావు, సిమ్మయ్య, ఎంపీటీసీ ఎస్.మంగయ్య, పార్టీ నాయకులు సోమేషు, వెంకీ, చలపతిరావు, ఎన్.కృష్ణ, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.



వీరఘట్టంలో నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమం

సంతకాల సేకరణలో స్వచ్ఛందంగా పాల్గొంటున్న ప్రజలు

వీరఘట్టం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ తలపెట్టిన కోటి సంతకాల సేకరణకు ప్రజలు స్వచ్ఛందంగా తరలి వస్తూ తమ మద్దతును సంతకాల ద్వారా తెలియజేస్తున్నారని వీరఘట్టం ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అన్నారు. వీరఘట్టం ప్రధాన రహదారిలో మంగళవారం నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని ఎంపీపీ అన్నారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగించడం అన్యాయమన్నారు. పేదలకు వైద్య విద్యను దూరం చేయాలని చూస్తున్న కూటమి కుయుక్తులను తిప్పికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మరో రెండు రోజుల పాటు వీరఘట్టం మండల కేంద్రంలో అన్ని వీధుల్లో పర్యటించి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల వైస్ ప్రెసిడెంట్ పిన్నింటి శ్రీనివాసరావు, భోగి మణి, దొలూరు శ్రీకాంత్, భోగి మదన్, బుజ్జి, శిర్లాపు జగన్ తదితరులు పాల్గొన్నారు

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల తొలగింపు మానుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: గురుకులాలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల తొలగింపు ఆలోచనను ప్రభుత్వం మానుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో మంగళవారం కోరారు. గతంలోని కాంగ్రెస్, వైఎస్సార్ సీపీ ప్రభుత్వాలు ఆయా పాఠశాలల్లోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయడం జరిగిందని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వానిదేనన్నారు. అలాగే జీవో నంబర్ 3 లేకుండా డీఎస్సీ నిర్వహించి గిరిజన నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను ప్రభుత్వం మానుకోవాలని హితవుపలికారు.

గుమ్మలక్ష్మీపురం: గురుకులాలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలు, జీపీఎస్ స్కూళ్లలో కొన్ని దశాబ్దాలుగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉపాధ్యాయులను యథావిధిగా విధుల్లో కొనసాగించాలని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బొత్తాడ గౌరీశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఇటీవల డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులను వారి స్థానాల్లో నియమించడం ద్వారా వారి భవిష్యత్ ప్రశ్నార్థకమైందన్నారు.

చాలా ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తినే నమ్ముకుని బతికిన వారిని రెగ్యులర్ చేయాల్సింది పోయి అన్యాయంగా వారిని రోడ్డున పడేయడం తగదన్నారు.

చురుగ్గా తాడికొండ జలపాతం అభివృద్ధి పనులు



తాడికొండ జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు (ఇన్‌సెట్లో) వాటర్ ఫాల్ వద్ద షాపు ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఏకైక పర్యాటక ప్రాంతంగా పేరొందిన తాడికొండ(మొగనాళి గెడ్డ) జలపాతం అభివృద్ధి పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి సెప్టెంబరు 19వ తేదీన ఈ జలపాతాన్ని పరిశీలించి, పర్యాటకంగా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో జలపాతం సందర్శనకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వారికి మౌలిక సదుపాయాలు అందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జంగిల్ క్లియరెన్స్ చేపట్టగా, ప్రకృతి అందాలు తిలకిస్తూ సందర్శకులు సేదతీరేందుకు హట్స్(గుడిసెలు) ఏర్పాటు చేసి వాటికి రంగులద్దుతున్నారు. పర్యాటకులకు స్నాక్స్, ఫాస్ట్‌ఫుడ్, కూల్‌డ్రింక్స్ అక్కడే దొరికేలా స్థానిక డ్వాక్రా మహిళా సంఘాలతో షాపు కూడా పెట్టిస్తున్నారు. ఇదే షాపును ఈ నెల 16వ తేదీన కలెక్టర్ ప్రారంభిస్తారని అధికారులు చెబుతున్నారు.

శ్రమదానంతో రోడ్డు మరమ్మతులు



రోడ్డు బాగు చేస్తున్న గ్రామస్తులు

కురుపాం: మండలంలోని మొండెంఖల్ గ్రామం నుంచి తొస్తంగి, నేరేడుమానుగూడ, జోలుమానుగూడ తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. ఏ చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డంతా బురదమయమై ఏ ఒక్కరూ ప్రయాణం చేయడానికి వీలులేని విధంగా తయారవుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మొత్తం బురదగా మారి కనీసం ద్విచక్ర వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితి ఏర్పడింది. గ్రామస్తులంతా రోడ్డు బాగు చేసేందుకు మంగళవారం ముందుకువచ్చారు. అందరూ శ్రమదానం చేసి మరీ రోడ్డులోని బురద తీయడం, గుంతలను కప్పడం వంటివి చేశారు. ఇప్పుడు ద్విచక్ర వాహనాల రాకపోకలకు మార్గం సుగమమైంది. గ్రామస్తులు చేసిన మంచి పనిని అటువైపుగా వెళ్తున్న వారంతా అభినందిస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి కొత్త రోడ్డు వేయాలని కోరుతున్నారు.

నేడు ఆలయ హుండీల్లోని ఆదాయం లెక్కింపు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీకోదండరామస్వామి ఆలయాల హుండీల్లో భక్తుల కానుకల రూపంలో చేరిన ఆదాయాన్ని బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వీవీ సూర్యనారాయణ ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో హుండీలు తెరిచి లెక్కింపు చేయడం జరుగుతుందని, దాతలు, భక్తులు ఈ కార్యక్రమానికి హాజరుకావచ్చన్నారు.

జీవన ఎరువులతో నాణ్యమైన పంట దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

కురుపాం: మండలంలోని మండ గ్రామంలో జీవన ఎరువుల వినియోగం, వాటి వల్ల పంటకు కలిగే ప్రయోజనాలపై మంగళవారం అవగాహన కల్పించారు. రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.స్రవంతి, డాక్టర్ ఎం.అనంతవిహారిలు జీవన ఎరువులపై రైతులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని, వీటిని పంటలకు వేయడం వల్ల నాణ్యమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు.

సైన్స్ సెమినార్ రేపు

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ సెమినార్ గురువారం నిర్వహించనున్నట్లు ఎంఈవోలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు తెలిపారు. స్థానిక ఎంఆర్‌సీలో వీరు విలేకరులతో మంగళవారం మాట్లాడారు. సెమినార్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మాత్రమే పాల్గొంటారని తెలిపారు. యూపీ, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10వ తరగతి విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ నెల 16న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఈ సెమినార్ నిర్వహిస్తామన్నారు. సెమినార్‌లో ప్రతిభ కనబరిచిన వారు ఈ నెల 17న పార్వతీపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరగబోయే జిల్లా స్థాయి సెమినార్‌లో పాల్గొంటారని తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయా పాఠశాలల సైన్సు ఉపాధ్యాయులు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు.

ప్రజారోగ్యంపై అధికారులు దృష్టి సారించాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ శెట్టి పద్మావతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

కురుపాం: ప్రజారోగ్యంపై దృష్టి సారించాలని అధికారులకు ఎంపీపీ శెట్టి పద్మావతి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించి, శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. తొలుత ఒక్కో శాఖకు చెందిన అధికారి తమ శాఖ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ కురుపాం గురుకుల పాఠశాలలో కలుషిత నీరు వల్ల ఇద్దరు మృతి చెందగా మరి కొంతమంది విద్యార్థులు పచ్చకామెర్లు బారినపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని ఈ నేపథ్యంలో పంచాయతీ అధికారులు, వసతిగృహాల సంక్షేమ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి మరోసారి అలాంటి తప్పులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు కాచివడపోసిన తాగునీటిని అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారులు మాట్లాడుతూ మొండెంఖల్, జరడ, పెదగొత్తిలి, వలసబల్లేరు తదితర పంచాయతీల్లో రోడ్లు అధ్వానంగా ఉండడంతో ఆయా ప్రాంతాల గిరిజనులు రాకపోకలు సాగించలేకపోతున్నారని, ఐటీడీఏ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు బంగారునాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పలు పంచాయతీల్లో నాడు–నేడు కింద చేసిన అభివృద్ధి పనులకు ఇప్పటివరకు బిల్లుల చెల్లింపులు జరగలేదని, తక్షణమే బిల్లులు విడుదలయ్యేలా చూడాలన్నారు. ఎంపీడీవో ఉమామహేశ్వరి మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనల మేరకు గురుకుల పాఠశాలలో పారిశుధ్య పనులు చేయించామని, మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో తహసీల్దారు జయ, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లి సుజాత, వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు, ఏఎంసీ చైర్మన్ కె.కళావతి, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు నిషార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులపై రైతులకు అవగాహన



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

సీతంపేట: మండలంలోని దొంబంగివలస గ్రామంలో రైతులకు వాతావరణ మార్పులపై వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ గూర్చి వివరించారు. అడవి పెంచడం వలన లాభాలు తెలియజేశారు. దుంపలు, ఆకుకూరలు, చిరుధాన్యాల పంటల వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. పురుగు మందులకు బదులు సీమాస్త్రం, జిల్లేడు ద్రావణం కషాయాలు తయారు చేసి పంటలకు వేయాలన్నారు. కార్యక్రమంలో సీసీలు రామయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో బాలికలు ముందుండాలి



బహుమతులు అందుకున్న విద్యార్థినులతో ఐసీడీఎస్ సిబ్బంది

సీతంపేట: అన్ని రంగాల్లో బాలికలు ముందుండాలని సీడీపీవో సిమ్మాలమ్మ అన్నారు. స్థానిక కేజీబీవీలో ప్రపంచ బాలికా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలందరూ అభివృద్ధి సాధించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. లింగ వివక్షతకు గురికాకుండా బాలికలు ప్రథమంగా ఉండాలన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించాలన్నారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, గౌరి తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురంలో ఆధ్యాత్మిక శోభ



సామూహిక ఘటాలతో పట్టాభమ్మ తల్లి ఆలయానికి వెళ్తున్న భక్తులు

పాలకొండ రూరల్: మండలంలోని గోపాలపురంలో కొలువైన పట్టాభమ్మ తల్లికి ఏడేళ్ల తరువాత గ్రామస్తులు సామూహిక సంబరాలు చేపట్టారు. మంగళవారం రాత్రి గ్రామస్తులు తమ ఇళ్ల నుంచి గ్రామ దేవతలకు ఘటాలు, ముర్రాటలు సమర్పించారు. సాంప్రదాయ పద్ధతిలో ప్రతీ కుటుంబం నుంచి ఒక్కో ఘటం తలదాల్చిన మహిళలు గ్రామమంతా కలియతిరుగుతూ పవిత్ర నాగావళి తీరాన ఉన్న అమ్మవార్లకు మొక్కులు సమర్పించారు. సామూహిక వేడుకతో గ్రామంలో ఆధ్మాతిక శోభ సంతరించుకుంది. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన శక్తి వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

‘ఉల్లాస్’ను విజయవంతంగా నిర్వహించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరమణ

వీరఘట్టం:

నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో బి.వెంకటరమణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమాలను నిర్వహించే వాలంటీర్ టీచర్లకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అభ్యాసకులకు 100 గంటల పాటు ఈ కార్యక్రమాన్ని చేపట్టి వారిని అక్షరాస్యులుగా మార్చాలని సూచించారు. సమావేశంలో ఏపీవో జి.సత్యంనాయుడు, ఏపీఎం కె.రాము, వాలంటీరు టీచర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కొమరాడ: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.శారదాంబ తెలిపారు.

రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని గంగారేగువలస గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ మంగళవారం చేపట్టారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, వారికి ప్రతిరోజూ పౌష్టికాహారం అందేలా చూడాలని ఆమె చెప్పారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు వంటివి ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత ఉల్లాస్ శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి:

నిరక్షరాస్యులను అక్షరాస్యులను చేసే రెండో విడత ఉల్లాస్ శిక్షణ మండల కేంద్రంలో ఎంపీపీ ఉరిటి రామారావు మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో నిరక్షరాస్యులు లేకుండా చూడాల్సిన బాధ్యత వలంటీర్లదేనన్నారు. జిల్లా వయోజన విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వైకుంఠరావు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి 15 మంది నిరక్షరాస్యులకు ఒక వలంటీర్‌ను నియమించడం జరిగిందని, వారే వారిని అక్షరాస్యులుగా మలిచే బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం వలంటీర్లకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.పైడితల్లి, ఏపీఎం పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: వయోజనుల్లోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మలిచేందుకు వలంటీర్లు కృషి చేయాలని ఎంపీడీవో ఎల్.శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం సతీష్ కోరారు. స్థానిక వెలుగు, ఎంపీడీవో కార్యాలయాల్లో వెలుగు, డీఆర్‌డీఏ వలంటీర్లకు ఉల్లాస్ శిక్షణ తరగతులు మంగళవారం నిర్వహించారు.

జియ్యమ్మవలస: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ప్రారంభమైన ఉల్లాస్ శిక్షణలో ఎంపీడీవో కర్రి ధర్మారావు పాల్గొని, వలంటీర్లకు దిశానిర్దేశం చేశారు. వయోజనులైన నిరక్షరాస్యులను అక్షరాస్యులను చేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని, ఇక్కడ నేర్చుకున్న విషయాల ఆధారంగా వారిని అక్షరాస్యులను చేయాలని తెలిపారు.